www.telugubooks.tk Visit us for mor

# మార్కండేయ పురాణము

శౌనకాది మహామునులు సూతుని జూచి, "నీవలన భాగవత, భవిష్య పురాణములు విని సంతోషించినాము. మార్కండేయ పురాణమును వినిపింపు"మని యడుగగా సూతు డిట్లు చెప్ప దొడగెను.

"మునీశ్వరులారా!వినుడు. పూర్వ మొకప్పుడు భారతకథ నంతను వ్యాసుని వలన విన్న జైమినికి కొన్ని సందేహములు మిగిలిపోయెను. అవి వ్యాసునే అడిగి తీర్చుకొందమన్న ఆ అవకాశము రాలేదు. ఒకనాడు మార్కండేయ మహాముని ఆశ్రమమునకు వెళ్ళి, "మునీంద్రా!నాకు భారతము విన్న తరువాత కొన్ని సందేహములు మిగిలిపోయినవి. వానిని తీర్చు"డని అడిగెను. మార్కండేయుడు, "నాకు తపస్సు చేసికొనవలసి యున్నది. నీవు వెళ్ళి వింధ్యపర్వతములమీద నివసించుచున్న 1. పింగాక్ష 2. నిబోధ 3. సుపత్ర 4. సుముఖములను నాలుగు పక్షులున్నవి. వానిని జ్ఞానపక్షులందురు. వానిని అడిగినచో నీ సందేహములు తీర్చు"నని చెప్పగా జైమిని, "మునివర్యా!పక్షులేమి?మాటలాడుట యేమి?మహాపండితుల వలె నా ధర్మసందేహములను తీర్చుట యేమి?"అని అడుగగా మార్కండేయుడు, "జైమినీ! పూర్వము దుర్వాసుడు మహాతపస్సు చేయుచుండెను. అతని తపస్సునకు భయపడి యింద్రుడు తపోభంగము చేయటకై "వపువు"అను అప్సరసను పంపెను. ఆమె నృత్యగానవినోదములతో దూర్వాసుని తపస్సునకు భంగము కలిగించెను. దుర్వాసుడు తపోభంగ మైనందుకు ఆగ్రహించి, "ఓసీ, నీవు నా తపస్సునకు భంగము కలిగించితివి. కనుక ఒక కంకపక్షి (గ్రద్ద)వై జన్మించు"మని శపించెను. ఆమె దుర్వాసుని కాళ్ళమీద పడి, "నా అపరాధమును మన్నింపుము. శాపవిముక్తి యెట్లగునో తెలుపు"మని ప్రార్థించెను. దుర్వాసుడు ఆమెను జూచి కరుణించి, "నీ గర్భమున నలుగురు పిల్లలు పుట్టుదురు. అర్జునుని బాణము దెబ్బతగిలి మరణించి, నీవు నిజరూపమును దాల్చి స్వర్గమును చేరెదవు"అని అనుగ్రహించెను. వపువు గ్రద్దగా జన్మించెను. మందపాలపుత్రుడైన ద్రోణుడను వానిని పెండ్లాడి పదునారేండ్లు కాపురము చేసెను. పదునారవయేట గర్భవతియై, చూలాలుగా నుండగానే భారతయుద్ధము జరుగుచున్నదని తెలిసికొని చూచుటకు కురుక్షేత్రమునకు వెళ్ళెను. పైనుండి యుద్ధము చూచుచుండగా అర్జునుడు ప్రయోగించిన బాణములలో ఒకటి వచ్చి యాగ్రద్దకు తగిలెను. వెంటనే గర్భమునందున్న నాలుగు గ్రుడ్లను నేలమీద జారిపడెను. నా పిల్లల నా భగవంతుడే కాపాడవలెనని దేవుని ప్రార్థించుచు శరీరమును విడిచెను.

www.telugubooks.tk Visit us for mor


ఆ యుద్ధసంరంభములో ఒక ఏనుగు మెడలో నున్న గంట, శత్రుసైనికుని బాణపు దెబ్బతో తెగి నాలుగు గ్రుడ్లపై బోర్లగా పడెను. ఆ గంటక్రింద గ్రుడ్లు సురక్షితముగా నుండెను. భారతయుద్ధము పూర్తియై అచ్చట ప్రశాంతత నెలకొనెను. ఒకనాటి ప్రభాతవేళ శమీకుడను మహాముని ఆ కురుక్షేత్రము మీదుగా పోవుచుండెను. గంటక్రింద గ్రుడ్లు పిల్లలై కిచకిచ లాడుచుండెను. ఆ ధ్వని విని గంటక్రింద ధ్వనియే మని ఆశ్చర్యపడి, ముని గంటనెత్తి చూచెను. ఆ గంట క్రింద నాలుగు పక్షిపిల్లలు కనిపించెను. శమీకుడు కరుణ గలిగి వానిని తమ యాశ్రమమునకు తీసికొనిపోయెను. అప్పుడా పక్షులు శమీకునితో, "ఓ మహానుభావా!తండ్రివలె మమ్ము కాపాడినావు. నీ ఋణము మే మెట్లు తీర్చుకొనగలము?మేము నీకు ఏవిధముగా సేవ చేయగలము?చెప్పు"మని యడిగెను. పక్షులు మానవభాషలో మాట్లాడుచున్నందుకు శమీకుడు ఆశ్చర్యపడి, "ఓ పక్షిశాబకము (పిల్ల) లారా!మీరు మానవభాషలో మాటలాడుట మాకు చాలా వింతగా నున్నది. మీ రెవ్వరు?ఎందుకీ పక్షి జన్మము లెత్తినారు?తెలుపవలసినదని అడుగగా పక్షిపిల్ల లిట్లు సమాధానము చెప్పెను.

"ఓ ఋషీశ్వరా!పూర్వము సుకృతియను మహామునికి మేము నలువురమును పుత్రులుగా పుట్టినాము. వేదశాస్త్రములు చదువుకొనుచు మా తల్లితండ్రులను సేవించుకొనుచు కాలము గడుపుచుంటిమి. ఇట్లుండగా ఒకనాడు దేవేంద్రుడు మా తండ్రియొక్క సత్యమును బరీక్షించుటకై గ్రద్ధరూపమున వచ్చి నాకు నరమాంసమును ఆహారముగా పెట్టుమని కోరెను. అప్పుడు మా తండ్రి "మీలో ఎవరైనను ఇంద్రునకు ఆహారమగుడు"అని ఆజ్ఞాపించెను. సర్వప్రాణులకును తమ ప్రాణముకన్న ప్రియమైనది ఇంకనే ముండును?ఎవరికి వారము భయముతో తండ్రి యాజ్ఞను పాలించక ఊరకుంటిమి. అప్పుడు మా తండ్రి మమ్ము నలుగురిని పక్షులై పుట్టుడని శపించెను. తన శరీరమును ఇంద్రునికి ఆహారముగా సమర్పించెను. ఇంద్రుడు నా తండ్రి త్యాగబుద్ధికి సంతోషించి, మమ్ముజూచి, "మీరు వింధ్యపర్వతగుహలో నివసింపుడు. జైమిని అను వ్యాసశిష్యుడు మీవద్దకు వచ్చి కొన్ని ధర్మసందేహము లడుగును. ఆ సందేహములను దీర్చి మీరు శాపవిముక్తి పొందుడు. మీరు పక్షులైనను సర్వవేదశాస్త్రజ్ఞానమును బొంది ధర్మపక్షులు, జ్ఞానపక్షులు అని పేరు పొందెదరు"అని మమ్ముగూడ అనుగ్రహించి వెడలిపోయెను"అని చెప్పగా విని శమీకుడు, "మీరు నాకు చేయవలసిన దేమియు లేదు. మీ వినయవిధేయతలకు సంతోషించినాను.

www.telugubooks.tk Visit us for mor


ఇంక వింధ్యపర్వతములకు వెళ్ళుడు"అని సెల విచ్చి పంపెను. కావున ఓ జైమినీ!నీవు ఆ పక్షులవద్దకు వెళ్ళి నీ ధర్మసందేహములను దీర్చుకొనుము. అడిగిన వారి సందేహములు దీర్చుట మహాత్ముల లక్షణము"అని జైమినిని పంపి మార్కండేయుడు తపస్సు చేసికొనుటకు వెళ్ళెను. జైమిని వింధ్యపర్వతములలో జ్ఞానపక్షులను వెదకుచు వెళ్ళి వానిని జూచెను. ఆ పక్షులు సుస్వరముగా వేదాధ్యయనము చేయుచుండెను. అతడా పక్షులను సమీపించి "ఓ జ్ఞానపక్షులారా!నేను వ్యాసుని శిష్యుడను. నన్ను జైమిని యందురు. మార్కండేయుడు చెప్పిన మాటలను బట్టి మీవద్ద ధర్మసందేహములు తీర్చుకొనుటకై వచ్చినాడను. నా సందేహములు తీర్చి నన్ను కృతార్థుని చేయుడు"అని యడుగగా, ఆ పక్షులు "ఓ మునీంద్రా!నీకు గలిగిన సందేహములేవో అడుగుము. మా చేతనైంత వరకు సమాధానములు చెప్పెద"మని చెప్పెను.

జైమిని తన సందేహములిట్లు వెల్లడించెను.

1. శ్రీమన్నారాయణుడు ద్వాపరయుగమున లీలామానుషవిగ్రహుడై పుట్టుటకు కారణమేమి?
2. లోకము వింతపడునట్లు ద్రౌపదికి అయిదుగురు భర్త లుండుటకు హేతువు ఏమిటి?
3. కురుపాండవులకు యుద్ధము సంభవించినపుడు బలరాముడు తీర్థయాత్రలకు పోవుటకు కారణమేమి?
4. ద్రౌపదికి బుట్టిన అయిదుగురును రాజపుత్రులైయుండియు వివాహాది సంస్కారములు లేక దిక్కులేని చావు చచ్చుటకు కారణ మేమి?

జ్ఞాన పక్షులు జైమిని సందేహములకు ఈ విధముగా సమాధానములు చెప్పెను.

1. భూమియందు అధర్మము పెరిగి ధర్మము నశించుచున్నప్పుడు, ఆ భూభారమును తగ్గించుటకై శ్రీమన్నారాయణుడు అవతారము లెత్తునుగదా!అందుకే మానవుడై పుట్టెను.

"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"

2. లోకము వింతపడునట్లు ద్రౌపదికి అయిదుగురు భర్త లుండుటకు హేతువు ఏమిటి?
3. కురుపాండవులకు యుద్దము సంభవించినపుడు బలరాముడు తీర్థయాత్రలకు పోవుటకు కారణమేమి?
4. ద్రౌపదికి బుట్టిన అయిదుగురు రాజపుత్రులైయుండియు వివాహాది సంస్కారములు లేక దిక్కులేని చావు చచ్చుటకు కారణమేమి?

www.telugubooks.tk Visit us for mor


4. ద్రౌపదికి బుట్టిన అయిదుగురు రాజపుత్రులైయుండియు వివాహాది సంస్కారములు లేక దిక్కులేని చావు చచ్చుటకు కారణమేమి?

జ్ఞాన పక్షులు జైమిని సందేహములనకు ఈవిధముగా సమాధానములు చెప్పెను.

1. భూమియందు అధర్మము పెరిగి ధర్మము నశించుచున్నప్పుడు, ఆ భూభారమును తగ్గించుటకై శ్రీమన్నారాయణుడు అవతారము లెత్తునుగదా!అందుకే మానవుడై పుట్టెను.

"యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"

అని గీతలో శ్రీకృష్ణుడు స్వయముగా చెప్పియున్నాడు కదా!

2. దేవేంద్రుడు పూర్వము త్రిశిరుడను (విశ్వరూపుడు) వానిని సంహరించుట చేత బ్రహ్మహత్యాపాతకము సంభవించెను. ఆ పాపమును యమునికిని, వాయువునకును, అశ్వినీదేవతలకును నాలుగుభాగములు పంచియిచ్చి, వారియందు అనుగ్రహము కలవాడై తన అంశలను వారియందు నిలిపెను. అందుకే యమప్రసాదము వలన ధర్మరాజును, వాయువువలన భీముడును, అశ్వినీదేవతలవలన నకుల సహదేవులును జన్మించిరి. ఇంద్రుడు తన అంశతో అర్జునుడుగా జన్మించెను. ఈ సంగతి గ్రహించిన శచీదేవి తాను ద్రుపదుని యజ్ఞాగ్నిహోత్రమునుండి పుట్టి యింద్రాంశగలిగిన పంచపాండవులకును ధర్మపత్ని అయ్యెను.

3. బలరామునకు ఇటు పాండవులు బావమరదులు. పిల్ల నిచ్చి కలుపుకొన్న బంధువులు (సుభద్రను). అటు తన దగ్గర గదాయుద్ధము నేర్చుకొన్న ప్రియశిష్యుడు దుర్యోధనుడు. ఇటు పాండవపక్షపాతి తన తమ్ముడు శ్రీకృష్ణుడు. ఏ పక్షములో చేరినను తనకు ప్రియమైన వారితోనే యుద్ధము చేయవలెను. ఇది ఆలోచించి తటస్థుడై తీర్థయాత్రల వంక పెట్టుకొని యుద్ధమువైపు కన్నెత్తి చూడకుండ పోయెను.

4. ఉపపాండవులు విశ్వేదేవులు. విశ్వామిత్రుని శాపమువలన ద్రౌపదీ గర్భమున బుట్టి, వివాహములు భార్యాపుత్రులు వంటి లంపటములలో దగులుకొనక బ్రహ్మచారులుగానే అశ్వత్థామ చేతిలో దారుణముగా మరణించిరి.

అని చెప్పగావిని, జైమిని చాలా ఆనందించి, మహాత్ములారా!నా కింకను కొన్ని సందేహము లున్నవి. అవి కూడ తీర్చుడని యడుగగా పక్షులు సమ్మతించెను.

www.telugubooks.tk - Visit us for mor


జెమిని యిట్లు అడిగెను. "పాపపుణ్యము లనగా ఎట్లుండునో తెలుపుడు".

జ్ఞానపక్షు లిట్లు ఉత్తరము చెప్పెను. "మునీంద్రా!పాపములు తెలిసి చేసినవి, తెలియక చేసినవి అని రెండు విధములు. అవి చిన్నచిన్నవైనచో ఆ ఫలితములు వెంటనే అనుభవమునకు వచ్చును. ఏ రోగరూపములోనో అనుభవించవలెను. పెద్దవైనచో జన్మాంతరములందుకూడ తరుముకొని వచ్చును. తెలిసి చేసిన పాపములకు శిక్ష పెద్దదిగా నుండును. ఒకప్పుడు మిథిలా నగరములో జనకవంశములో విపశ్చితుడను రాజుండెను. అతడు మహా ధర్మాత్ముడు. ప్రజలను బిడ్డలవలె పాలించెను. అతడు మరణించగా యమదూతలు వచ్చి నరకమునకు తీసికొనిపోయిరి. రాజు యమునిజూచి, "నేను చేసిన పాపము లేవి?నన్నేల నరకమునకు దెచ్చితిరి?"అని అడుగగా, అతడు "రాజా!నీవు ధర్మాత్ముడవే, కాదనను, కాని ఋతుస్నాతయైన నీ భార్య లిద్దరిలో ఒకదానినే స్వీకరించి రెండవదానిని వదిలివేసితివి. అందుచేత నీకు పాపము చుట్టుకొనెను. అందుకే నీ కీ నరకలోకదర్శనము"అని చెప్పి స్వర్గలోకమునకు పంపివేసెను. కావున తెలియక చేసినను తప్పు తప్పేకాని ఒప్పుకాదు".

జైమిని పాతివ్రత్య మహిమయెట్టిదో వివరించి చెప్పుడనగా పక్షులిట్లు చెప్పెను.

## సుమతి కథ

పూర్వము ప్రతిష్ఠానపురములో కౌశికుడను బ్రాహ్మణుడు ఉండెడివాడు. అతని యదృష్టము కొలది సుమతి అనునది భార్యగా లభించినది. వాడెంత కోపిష్టివాడో ఆమె అంత శాంతస్వభావము కలది. వాడెంత తిరుగుబోతో ఆమె అంత మహాపతివ్రత. వాడు చెడు తిరుగుళ్ళు తిరిగి కుష్ఠురోగము దెచ్చుకొనెను. అయినను సుమతి అతనిని దైవమువలెనే సేవించుచుండెడిది. ఇట్లుండగా కౌశికు డొకనాడు ఒక వేశ్యాకాంతను చూచెను. ఆమె దగ్గరకు తనను తీసికొనిపొమ్మని భార్యను వేధించెను. ఆమె వేశ్య నొప్పించి వచ్చెను. భర్తను భుజాలపై కూర్చుండబెట్టుకొని వేశ్య యింటికి తీసికొని పోవుచుండగా అతనికాలు ఆ చీకటిలో నొకనికి తగిలెను. అతడు మాండవ్యముని. అతడు చిన్నప్పుడు తూనీగలను పుల్లకు గ్రుచ్చి చంపెడివాడట. రాజదండన పొందినవానికి యమదండన ఉండదుగదా!రాజును అతడు, తనకు శిక్ష విధింపుమని కోరగా రాజు అతనిని కొఱత వేయించెను. ఈ కౌశికుని కాలు ఆ కొఱ్ఱుమీద నున్న మాండవ్యునికి తగిలెను. అతడు "నన్ను బాధించిన నీ శిరస్సు సూర్యోదయము అగుసరికి వేయి చెక్కలగుగాక"అని శపించెను.

www.telugubooks.tk Visit us for more

సుమతి అతని శాపము విని, నా భర్త చనిపోవునన్నచో అసలు సూర్యోదయమే కాకూడదని శపించెను. ఆమె అన్నట్లుగానే సూర్యోదయము కాకుండ ఆగిపోయెను. లోకములన్నియు తలక్రిందులైనవి. అపుడు బ్రహ్మాదిదేవత లందరును వచ్చి, "తల్లీ! సూర్యోదయము కానిచో లోకములన్నియు తల్లడిల్లుచున్నవి. నీ భర్త చనిపోయినచో మేము వానిని బ్రతికించి ఆరోగ్యవంతుని, సుగుణవంతుని చేసెదమని"చెప్పగా ఆమె శాపమును ఉపసంహరించి సూర్యోదయమునకు అనుమతించినది. సూర్యోదయము కాగానే కౌశికుడు మరణించెను. వెంటనే అనసూయ అతనిని పునర్జీవితుని చేసెను. అతడు నవమన్మథాకారుడై భార్యతో గూడి బ్రహ్మాదులను స్తుతించెను. పాతివ్రత్యము అంత శక్తివంతమైనది.

## దత్తాత్రేయుడు

ఆత్రి మహాముని భార్యయైన అనసూయ లోకములకు చేసిన మహోపకారమునకు ఆనందించి బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ఆమెకు వరమిచ్చెదము కోరు మనిరి. ఆమె "త్రిమూర్తులారా!మీ ముగ్గురి అంశలతోను నా కొక కుమారుడు పుట్టవలెనని కోరుకొనెను. వారు 'తథాస్తు'అనిరి. అట్లే త్రిమూర్తుల అంశములతో ఒక కుమారుడు కలిగెను. అనసూయాత్రులు సంతోషించి ఆ కుమారునికి దత్తుడు అని పేరు పెట్టిరి. ఆత్రికుమారుడు కనుక ఆత్రేయుడు. దత్త ఋ ఆత్రేయుడు = దత్తాత్రేయుడయ్యెను. పుట్టుకతోనే మహా తపస్సంపన్నుడయ్యెను. కొందరు మహాయోగులు అతని వద్ద యోగవిద్య నేర్చుకొనుటకు వచ్చిరి. వారు పదేపదే యోగవిద్యను నేర్పుమని దత్తాత్రేయుని పీడింపసాగిరి. ఆయన తపస్సునకు ఆటంకము కలుగుచుండెను. అప్పుడాయన ఒక స్త్రీని సృష్టించి ఆమెతో భోగములనుభవించుచున్నట్లు వారికి కనిపించెను. అంతేకాదు, కుక్కలను నాల్గింటిని చేర్చి వానిని మచ్చిక చేయుచుండెను. మునులు ఆ ప్రవర్తనము చూచి, ఈ దత్తాత్రేయుడు మన కేమి యోగవిద్య నేర్పగలడు?ఆయనయే భోగలాలసుడై యున్నాడని తలంచి అతనిని విడిచి వెళ్ళిపోయిరి. ఆ సమయములో మాహిష్మతీ నగరమును పాలించు కృతవీర్యుడను రాజు మరణించెను. అతని కుమారుడైన యర్జునుని మంత్రిసామంతాదులు పట్టాభిషిక్తుని చేయబోగా అతడు "నేను నా తండ్రియంత సమర్థుడను గాను.

రాజ్యపాలనము చేయుటకు తగను"అని చెప్పగా వారందరును కులగురువైన గర్గుని వద్దకువెళ్ళి, యెట్లైనను అర్జునుని పట్టాభిషేకమునకు అంగీకరించునట్లు చేయుమని ప్రార్థించిరి. గర్గమహామునీ, కార్తవీర్యార్జునుని వద్దకు వెళ్ళి నచ్చజెప్పబోగా, అతడు వెనుకటి వలెనే మాటలాడెను. అప్పుడు గర్గుడు "అర్జునా!నీవు సహ్యగిరికి వెళ్ళుము. అచట దత్తాత్రేయుడను మహానుభావుడు తపము చేసికొనుచుండును. నీవు అతనిని సేవింపుము. అతడు నీకు అనేక పరీక్షలు పెట్టును. నీవు చలింపక, భక్తిశ్రద్ధలతో అతనికి సేవలుచేయుము. అతడు కరుణించి వరము లిచ్చుదాక అతనిని విడువకుము. పూర్వము ఇట్లే అతడు ఇంద్రుని అనుగ్రహించి రాజ్యము తిరిగి వచ్చునట్లు చేసెను"అనగా, ఆ కథ వినిపింపుము అని గురువును అర్జునుడడిగెను. గర్గుడిట్లు చెప్పెను. పూర్వము జంభాసురుడను రాక్షసుడు మహాబలవంతుడై స్వర్గముమీదికి దండయాత్రకు వచ్చెను. దేవతలకును రాక్షసులకును మహాసంగ్రామము జరిగెను. దేవతలు ఓడిపోయిరి. దేవేంద్రుడు తన గురువైన బృహస్పతి చెప్పిన చొప్పున దత్తాత్రేయుని వద్దకు వచ్చి అతనిని భక్తితాత్పర్యములతో సేవించెను. దత్తాత్రేయుడు ప్రసన్నుడై, "దేవేంద్రా!నీకేమి వరము కావలెనో కోరుకొనుము"అనగా ఇంద్రుడు, "స్వామీ!జంభాసురుడు వచ్చి స్వర్గరాజ్యము నాక్రమించినాడు. నా పరిస్థితి దయనీయముగా నున్నది. నాకు తిరిగి రాజ్యము వచ్చునట్లు అనుగ్రహింపుము"అని కోరెను. అపుడు దత్తాత్రేయ డింద్రునితో, "నీవు ఎట్లైనను ఆ జంభాసురుని నా యాశ్రయము వద్దకు వచ్చునట్లు చేయుము. ఆపై విషయములను నేను చక్కబెట్టెదను"అనెను. ఇంద్రుడు మరల జంభుని యుద్ధమునకు పిలిచెను. ఆ యుద్ధములో తాను వెనుకకు తగ్గుచున్నట్లు నటించి నెమ్మదిగా వానిని దత్తాత్రేయాశ్రమమునకు తీసికొని వచ్చెను. ఆ సమయమున దత్తాత్రేయుని ప్రక్కనే లక్ష్మీదేవి యుండెను. లక్ష్మిని చూచి మోహపరవశుడై జంభాసురుడు యుద్ధము మాటమరచి, ఆమె నొక తట్టలోబెట్టి తలమీద బెట్టుకొని పారిపోయెను. అప్పుడు దత్తాత్రేయుడు ఇంద్రుని పిలిచి, "నీ విప్పుడతనిమీదకు దండెత్తిపొమ్ము. నీకు విజయము కలుగు"ననెను. దత్తాత్రేయుడు ఇంద్రునితో మరల ఇట్లనెను. "దేవేంద్రా! ఇప్పుడు లక్ష్మి రాక్షసుల నెత్తిమీద నున్నది. ఇది వారికి దౌర్భాగ్యసూచకము. ఇప్పుడే నీకు జయము కలుగు అవకాశమున్నది. వెళ్ళుము"అనగా ఇంద్రుడు, లక్ష్మీనివాస స్థానములు తెలుపుమని ప్రార్థించెను. దత్తాత్రేయుడు ఇంద్రుని కిట్లు చెప్పెను.

www.telugubooks.tk - Visit us for mor


"మహాలక్ష్మి, పాదములందున్నచో ఐశ్వర్యములు గలుగును. పిక్కల (జంఘల) యందున్నచో ధనవస్త్రాది లాభము గలుగును. గుహ్యస్థానమునందున్నచో మంచిభార్య లేక మంచి భర్త (స్త్రీకి) వచ్చును. తొడలయందున్నచో సత్సంతానభాగ్యము కలుగును. హృదయమునందున్నచో కోరినకోరికలు అన్నియు తీరును. కంఠమునందున్నచో కనకమణిభూషణాది సంపదలు కలుగును. ముఖమునందున్నచో సకల విద్యా పాండిత్యముతోపాటు కవితా పటుత్వము కూడ కలుగును. శిరస్సునందుండెనేని, సకల దరిద్య్రములును కలిగి, ఆయువు, భోగభాగ్యములు నశించును. ఇప్పుడు మహాలక్ష్మి రాక్షసుల శిరస్సుపై నున్నది. కావున వారికి అపజయమును, నీకు జయమును కలుగును. వెంటనే యుద్ధప్రయత్నములు చేసి విజయుడవై స్వర్గసింహాసనము నధిష్ఠింపు"మని దీవించి పంపెను. ఇంద్రుడట్లే రాక్షసులను ఓడించి, దత్తాత్రేయుని అనుగ్రహముచే స్వర్గసింహాసనము నధిష్ఠించెను. గర్గుడు చెప్పిన మాటలు విని అర్జునుడు సహ్య పర్వతమునకు వెళ్ళి, అక్కడ తపము చేసికొనుచున్న దత్తాత్రేయుని అత్యంత భక్తిశ్రద్ధలతో సేవించుచు, అతడే మన్నను, ఏమి చేసినను కిమ్మనక తన పని తాను చేసికొనుచుండెను. ఒకనాడు దత్తాత్రేయుడు అర్జునుని జూచి, "నీవు నా ఆశ్రమమునకు ఏల వచ్చితివి?నీవలన నా తపస్సు పాడయిపోయినది"అనుచు చేతిదండముతో కొట్టెను. అర్జునుడు అది సహించి తన పని చేసికొనుచుండెను. అతని శ్రద్ధాభక్తులకు మెచ్చి దత్తాత్రేయుడు కరుణించి, "అర్జునా!నీయెడల ప్రసన్నుడనయితిని. ఏమి వరము కావలెనో అడుగుము"అనెను. అర్జునుడు "మునీంద్రా!నా రాజ్యపరిపాలనమున అధర్మము లేకుండునట్లును, సర్వశత్రువుల జయింపగలుగునట్లును అనుగ్రహింపుము"అని కోరెను. దత్తాత్రేయుడతడు కోరినవి అన్నియు ఇచ్చి, "రాజా!నీవు శత్రువులను జయించుటకై వేయి బాహువులను, అణిమాది అష్టసిద్ధులను అనుగ్రహించుచున్నాను. సుఖముగా రాజ్యపాలన చేసికొనుము"అని దీవించి పంపెను. అతడు తిరిగి రాజ్యమునకు వచ్చి పట్టాభిషిక్తుడై రాజ్యపాలనము చేసెను. జ్ఞానపక్షులు చెప్పిన దత్తాత్రేయుని కథ విని, జైమిని మరల నిట్లనెను. "ఓ జ్ఞానపక్షులారా!కువలయాశ్వు డెవరు?అతని కా పేరెట్లు వచ్చెనో చెప్పుడు"అను యడుగగా ఆ పక్షు లిట్లు చెప్పసాగెను.

www.telugubooks.tk Visit us for mor


## కువలయాశ్వుడు

పూర్వము శత్రుజిత్తు అను పేరుగల రాజొకడుండెను. అతని కొక కొడుకు. అతని పేరు ఋతుధ్వజుడు. గాలవమహాముని తపస్సుచేసికొనుచుండగా పాతాళకేతునను ఒక రక్కసుడు ఆ తపస్సునకు విఘ్నము చేయుచుండెను. అతడు ఋతుధ్వజుని, తన తపస్సునకు భంగము కలిగించుచున్న రాక్షసుని బారినుండి రక్షింపుమని కోరి, తన తపశ్శక్తిచే ఒక అద్భుతమైన గుఱ్ఱమును సృష్టించి, "దీని పేరు కువలయము. ఇది త్రిలోకములలో ఎక్కడికైనను పోగలదు. దీనికి అడ్డము లేదు. దీనిని గ్రహించి రాక్షసుని జయింపుము"అని దానినతని కిచ్చెను. కువలయము అను పేరుగల అశ్వముగల వాడగుటచే కువలయాశ్వుడను పేరు పొందెను.

రాజా గుఱ్ఱము నెక్కి ఆశ్రమమునకు వెళ్ళగా వాడొక అడవి పంది రూపమున మునీంద్రుని బాధించుచుండెను. అది చూచి ఒక బాణముతో గొట్టగా వాడొక బిలములో దూరెను. కువలయాశ్వుడు వానితో పాటు పాతాళమునకు వెళ్ళి అక్కడ ఒక అపురూప సౌందర్యవతిని జూచెను. ఆమెయు ఇతనిని జూచి మోహించెను. ఆమె చెలికత్తె ద్వారా, ఆమె పేరు మదాలస అనియు, పాతాళకేతు వామెను ఎత్తుకొని వచ్చి వివాహ మాడబోవుచున్నాడనియు తెలిసికొనెను. ఆమె తనను ప్రేమించినదని గ్రహించి తన గుఱ్ఱముమీద నెక్కించుకొని పోవుచుండగా ఆ రాక్షసుడు యుద్ధమునకు వచ్చెను. కువలయాశ్వుడు రాక్షసుని దివ్యాస్త్రములతో సంహరించి మదాలసతో తన నగరమునకు బోయి ఆమెను వివాహమాడి సుఖముగా నుండెను.

పాతాళకేతువు తమ్ముడు కేతువు సజ్జనులను బాధించుచున్నాడని తెలిసి అతనిని జయించుటకై కువలయాశ్వుడు వెళ్ళెను. పాతాళకేతువు ఒక ముని రూపముతో వచ్చి, "రాజా!వరణుని గూర్చి నేను ఒక యాగము చేయుచున్నాను. నేను వచ్చువరకును నా యాశ్రమును గాపాడుచుండుము. నీ కంఠాభరణము నా కిమ్ము"అని పుచ్చుకొని, కువలయాశ్వుని పురమునకు వచ్చి వృద్ధరాజుతో "రాజా!నీ కుమారుడు రాక్షసులతో యుద్ధము చేయుచు మరణించినాడు. ఇదిగో, అతని కంఠాభరణము"అని చెప్పెను. మదాలస ఆమాట వినగానే ప్రాణములు వదిలెను. రక్కసుడు తిరిగి ఆశ్రమమునకు వచ్చెను. రాజు తన నగరమునకు వెళ్ళి భార్య చనిపోయినదని తెలిసికొని విచారగ్రస్తుడై యుండెను.

www.telugubooks.tk Visit us for mor


నాగరాజు కుమారులు భూలోకసంచారమునకై వచ్చి, కువలయాశ్వుని జూచి అతని నోదార్చి అతనికి మిత్రులైరి. తరచుగా రాకపోకలు జరుపుచుండగా తండ్రియైన అశ్వతరుడు చూచి "మీరు ఎక్కడికి బోవుచున్నార"ని అడిగెను. వారు కువలయాశ్వుని గూర్చి చెప్పి, అతని విచారకారణమును గూడ వివరించిరి. నాగరాజు జాలిపడి కువలయాశ్వుని పిలిపించి, తన పడగలలోనుండి మదాలసరూపముతోనే యున్న ఒక యువతిని సృష్టించి వివాహము చేసెను. ఈ క్రొత్తమదాలస సకలవిద్యలును నేర్చిన పండితురాలు. రాజనీతిశాస్త్రమును నేర్చినది. మదాలసకు నలుగురు కుమారులు గలిగిరి. మొదటి ముగ్గురును తల్లియైన మదాలస వలన జీవబ్రహ్మతత్త్వము తెలిసికొని విరాగులై యోగనిష్ఠ నవలంబించి యింటినుండి వెడలిపోయిరి. నాలుగవవాడైన అలర్కునకు కువలయాశ్వుడు రాజ్య మొసంగెను. అతడు తల్లియైన మదాలస వలన అనేక ధర్మములు తెలిసికొనెను.

అలర్కునకు తల్లి చేసిన ధర్మబోధ

మదాలస పట్టాభిషిక్తుడైన కుమారుని జూచి "కుమారా!నీవు రాజ్యాభిషిక్తుడ వైతివి. రాజైనవాడు ధర్మములు తెలిసికొని ధర్మప్రకారము రాజ్యమును పాలింపవలెను"అనగా అలర్కుడు "అమ్మా!నాకు రాజనీతి ధర్మములు, వర్ణాశ్రమ ధర్మములు వివరించి చెప్పు"మని అడిగెను. ఆమె అలర్కున కిట్లు చెప్పసాగెను.

"కుమారా!స్త్రీలోలత్వము, మద్యపానము, జూదము, వేట, కఠినత్వము, దొంగతనము, పరనింద అను ఏడును సప్తవ్యసనములు. రాజువాని కెప్పుడును లోబడరాదు. రాజు బంధువులనైనను నమ్మియుండరాదు. మంత్రులను భృత్యులను వారి స్వభావములందలి గుణదోషములు తెలిసికొని నియమించుకొనవలెను. రాజులు గూఢచారులను నియమించుకొని, వారివలన రాజ్యములో జరుగుచున్న ప్రతి విషయమును తెలిసికొనుచు ఎప్పుడే చర్య అవసరమో ఆ చర్య తీసికొనుచుండవలెను. రాజులకు చారులే కన్నులు అనుమాట మరువరాదు. అవసరమైనప్పుడు శత్రువులతో గూడ స్నేహము చేయవలెను. సామదానభేదదండోపాయములు సమయోచితముగా ప్రయోగించు నేర్పు కలిగియుండవలెను

స్థాన, వృద్ధి, క్షయ, సంధి విగ్రహయానాదుల గురించి చక్కని పరిజ్ఞానము కలిగియుండవలెను. పిపీలికా వృత్తి (ప్రజా క్షేమమునకై ఆహారపదార్థములు సేకరించి యుంచుట) గలిగియుండవలెను. అవసరమైనప్పుడు రాజు శత్రువులయెడల కీటకవృత్తి (ఉపాయముచే వారున్నచోటును ధ్వంసముచేయుట) నవలంబించవలెను. ముఖ్యముగా రాజు కామక్రోధలోభమోహమదమాత్సర్యము లనెడి అరిషడ్వర్గమునకు వశుడై యుండరాదు. ఇంద్రియనిగ్రహము గలవానికి ఎచ్చటను అపజయము ఉండదు.

ఈతి బాధలు (ఎలుకలు, చిలుకలు, మిడుతలు మన్నగు బాధలు లేకుండ ప్రజాపరిపాలనము చేయుట రాజు యొక్క కర్తవ్యము.)

ఈతిబాధలు

" అతివృష్టి రనావృష్టిః మూషికా శ్శలభాశ్శుకాః,
అత్యాసన్నాశ్చ రాజానః షడేతా ఈతయస్స్మృతాః "

(అతివృష్టి, అనావృష్టి, ఎలుకలు, చిలుకలు, మిడుతలు, రాజులు అతిసమీపములో ఉండుట అనునవి ఆరును ఈతిబాధలు.) పూర్వము కొందరు మరుత్తు మున్నగువారు కామక్రోధాదులకు వశులై ప్రజారంజకులు కాలేక పతనమైరి. అందుచేత రాజైన వాని కీ నియమములు ఉండవలెను.

ఇంద్రుడు భూలోకమున వర్షములు కురిపించి, సస్యములు వృద్ధిచేసి, ప్రజలు చేయు యజ్ఞయాగాదుల వలన తాను గూడ తృప్తిపొందును. అట్లే రాజుగూడ ప్రజలకు అవసరమైన సౌకర్యములు సమకూర్చి వారి వలన పన్నులు గ్రహించి, ఆదరణమును పొందవలెను. పన్నులుగూడ ప్రజలను బాధించునవిగా ఉండరాదు. సూర్యుడు ఏడెనిమిది మాసములు మహీమండలముమీద నున్న నీటిని కిరణములతో పీల్చును. ఆ పీల్చిన నీటిని నాలుగుమాసముల పాటు వర్షము రూపమున భూమండలమునకు అందించును. అట్లే రాజు ప్రజలకు బాధలేకుండ పన్నులు గ్రహించి తిరిగి వారి క్షేమమునకే ఖర్చుపెట్టవలెను. వాయువు అన్ని జీవరాసులను సమానముగా ఆదరించునట్లు రాజు సర్వప్రజలను సమదృష్టితో జూచి ఆదరించవలెను.

ఇక దండనాధికారము విషయము : యముడు ఏ జీవి ఏయే పాపములు చేసెనో వానికి తగిన దండనము విధించును. వీడు తనవాడు, వీడు పరుడు అను భేదము అతనికి ఉండదు. రాజు కూడ అట్లే తప్పునకు తగిన దండనము విధించవలెను. పుణ్యకార్యములు చేసినచో అందులో ఆరవభాగము రాజునకు చెందును. పాపాత్ములై

www.telugubooks.tk Visit us for mor


లేనిచో ప్రజలు రాజునందు తేలికభావము కలిగి, తప్పులు చేయుటకు వెనుకాడరు. ప్రజలు ధర్మాత్ములై పుణ్యకార్యములు చేసినచో అందులో ఆరవభాగము రాజునకు చెందును. పాపాత్ములై పాపములు చేసినచో దానిలో సగము భాగము రాజునకు చెందును. కావున రాజు జాగ్రత్త గలవాడై పరిపాలింపవలెను. చంద్రుని చూచి ఆనందపడునట్లే ప్రజలు రాజును జూచి ఆనందించవలెను. ప్రజలను పట్టించుకొనని రాజు నరకమున బడును. "రాజ్యాంతే నరకధ్రువం" అందురు. రాజధర్మములు తన తల్లి వలన విన్న అలర్కుడు, "అమ్మా!వర్ణాశ్రమ ధర్మములను గూడ తెలియజెప్పుమని" అడిగెను.

## వర్ణాశ్రమ ధర్మములు

భగవంతునిచే సృష్టించబడిన వర్ణములు నాలుగు, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర నామములు గలవి. బ్రాహ్మణు డెప్పుడును అధ్యయనము, అధ్యాపనము, యజనము, యాజనము, దానము, ప్రతిగ్రహము అను ఆరు కర్మములను నియతముగా జేయుచుండవలెను. వీనిలో అధ్యాపనము (చదువు చెప్పుట) ప్రతిగ్రహము (యోగ్యమైన వస్తువులను దాన మిచ్చునపుడు పుచ్చుకొనుట) అన్నవి బ్రాహ్మణులకు జీవనోపాధికి పనికివచ్చును. అంతేకాదు. నిత్యాగ్నిహోత్రము, తపస్సు, శుచిత్వము, శాంతము అనునవి బ్రాహ్మణునిలో ఉండవలెను. తామసాహంకారములు పనికిరావు.

క్షత్రియునకు వేదాధ్యయనమును, యజ్ఞయాగాది కర్మములు చేయుట, అర్హులైనవారికి దానమిచ్చుట, విహితములైన పనులు. రాజోచితములైన విద్యలు నేర్చి ధర్మరక్షణము ప్రజాపాలనము చేయుట వీరి కర్తవ్యము. వైశ్యులు వేదాధ్యయనము చేసి, యజ్ఞములు దానములు మున్నగునవి చేయుచు, వర్తకము, వ్యవసాయము, పశుపోషణము గూడ చేయవలెను.

ఈ పై మూడు వర్ణములు వారికిని ఉపనయనాధికారము కలదు.

శూద్రులు ఈ పై మూడు వర్ణముల వారు చేయు కార్యములలో సహకరించుచు వారి శక్తియుక్తులను అందించుచుండవలెను.

ఇంక ఆశ్రమములు : ఇవి నాలుగు. బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసము. బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థములు మూడును బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు సమానములు. సన్యాసము తప్ప మిగిలినవి శూద్రులకు కూడ ఆచరణీయములే.

www.telugubooks.tk Visit us for mor


బ్రహ్మచర్యము : గురుకులవాసముచేసి యితర ఆలోచనలు మాని విద్యాభాసము చేయుట, నియమనిష్ఠలతో నుండుటకు అలవాటు చేసికొనుట దీనియందు జరుగవలెను.

గార్హస్థ్యము : (గృహస్థాశ్రమము) : విద్యాభ్యాసము పూర్తియైన తరువాత తనకు తగిన కన్యను పెండ్లాడి గృహస్థుడు కావలెను. మనుష్యయజ్ఞము, భూతయజ్ఞము, దేవయజ్ఞము, పితృయజ్ఞము, బ్రహ్మయజ్ఞము అను పంచమహాయజ్ఞము లాచరించుచు దేవ, పితృ, మనుష్య, భూతములకు సంతృప్తిగా పెట్టుచు, చదివిన వేదశాస్త్రములను (ఇతర విషయములను గూడ) తిరిగి వల్లెవేయుచుండవలెను. ఇంటికి వచ్చిన అతిథి అభ్యాగతుల నాదరించుచు, బంధువులను సంతోషపరచుచుండవలెను. గోసేవ చేయవలెను. స్నానసంధ్యావందనములు, అగ్నిహోత్రములు, పితృ తర్పణములు చేసి, నిత్యకర్మల నిట్లు జరుపుచుండవలెను. నైమిత్తికములను (తల్లిదండ్రులకు శ్రాద్ధములు పెట్టుట మొII) శ్రద్ధాభక్తులతో ఆచరించవలెను. పుత్రపుత్రికలకు విద్యాభ్యాసములు వివాహాదులు జరిపించవలెను. గృహస్థాశ్రమమునకు ఫలము సంతానమే గదా! దానివలన వంశవృద్ధి యగును.

వానప్రస్థము : ఇంటి బాధ్యతలన్నియు కొడుకులకు ఒప్పగించి, తాను సంసారములో సారములేదని గ్రహించి, భగవద్ధ్యానము చేసికొనుచు లౌకికమైన యితరచింతలు మాని ప్రశాంతముగా నుండుటయే యీ యాశ్రమములో చేయవలసిన పని.

పూర్వ మరణ్యములకు బోయెడివారు. ఇప్పుడది లేదు.

సన్న్యాసము : వానప్రస్థము తర్వాత సన్న్యాసాశ్రమము. ఇంద్రియ నిగ్రహముగలిగి ప్రాపంచిక భోగములయందు విరక్తుడై కేవలము ఆత్మ స్వరూపుడైన భగవంతునిలో జేరుటకు సాధన చేయుటయే సన్న్యాసి కర్తవ్యము. భిక్షాటనము చేయుచు,

ఏ యింటిలోను ఒక్కదినము కన్న ఎక్కువ ఉండరాదు. సన్న్యాసికి విషయభోగములందు ఆసక్తి కలిగినచో ఇక అతనికి అధోగతియే. భిక్షాటనము అహంకారనాశనమునకు హేతువు. అహంకారముగల సన్న్యాసి బ్రహ్మపదమును చేరలేడు.

## నిత్య పవిత్ర వస్తువులు

సాలగ్రామములు, బంగారము, నెయ్యి, నూతన వస్త్రములు, పుస్తకములు, మణులు నిత్య పవిత్రత గల వస్తువులు. నెయ్యి వేసి అభిఘారముచేసిన అన్నము పవిత్ర మగును. గోధుమధాన్యము, యవలు, గోక్షీరములు పంచగవ్యము పవిత్రములైనవి.

www.telugubooks.tk - Visit us for mor


పువ్వులు, పప్పులు, ధాన్యములు గృహోపకరణములైన పాత్రలు మున్నగునవి నీళ్ళు జల్లినచో శుద్ధియగును. పట్టుబట్టలు నారచీరలు, వేడి నీళ్ళు చల్లినచో శుద్ధియగును. వేదాధ్యయనము చేసిన బ్రాహ్మణుడును అగ్నియు నిత్యపవిత్రులు. వ్రతదీక్షలో నున్నవాడును, సన్న్యాసియు నిత్య పవిత్రులు.

అని జ్ఞానపక్షులు చెప్పగా విని జైమిని, అష్టసిద్ధులనగా ఎట్టివో వివరింపుమని అడిగెను. జ్ఞానపక్షులు ఇట్లు చెప్పసాగెను.

1. అణిమ = చిన్న రూపము దాల్చుట
2. మహిమ = పెద్దరూపము దాల్చుట

(ఈ రెండు సిద్ధులును, శ్రీమద్రామాయణ సుందరకాండలో హనుమంతునిలో చుడగలము.)

3. గరిమ = చాల బరువగుట

(తృణావర్తుని జంపు శ్రీకృష్ణునిలో చూతుము.)

4. లఘిమ = తేలికయగుట

(నీటిపైన నడచుట, ఆకాశమార్గమున పోవుట)

5. ప్రాప్తి = అనుకొన్న స్థాయికి చేరుట
6. ప్రాకామ్యము = కోరినది పొందుట
7. ఈశత్వము = పంచభూతాలపై అధికారము సంపాదించుట. (ప్రహ్లాదుని వలె)
8. వశిత్వము = ఇంద్రియములను లోబరచుకొని యిష్టార్థసిద్ధి నొందుట.

ఈ యెనిమిదింటిని అష్టసిద్ధులు అందురు. ఎవ్వరీ అష్టసిద్ధులను యోగమార్గమున పొందగలుగుదురో వారు బ్రహ్మస్వరూపమును పొందగలరు.

## అరిష్టములు

ధ్రువుడును శుక్రుడును, తన నీడయు కనబడనివాడు సంవత్సరములోపల మరణించును;సూర్యునియందును, అగ్నియందును కిరణములున్నట్లు కనిపించనిచో పదునొక్కండు నెలలు బ్రతుకును. కలలో తాను మలమూత్రములు విడిచినట్లుగాని వాంతి చేసికొన్నట్లు గాని కనిపించిన పదినెలలు బ్రతుకును. కలలో శవమునుగాని పిశాచములను గాని చూచినచో తొమ్మిది నెలలు జీవించును.

www.telugubooks.tk - Visit us for mor


కారణములేక లావైనట్లు గాని చిక్కినట్లుగాని కలలో కనిపించినను, బుద్ధిమాంద్యము కలిగినను సప్తమాసములలోపల మరణించును. అరుంధతీ నక్షత్రమును చూడలేకపోయినను గ్రద్ధ, కాకి, గ్రుడ్లగూబయు తలమీద తన్నినను ఆరునెలలో మరణించును. తన దేహమునీడలో శిరస్సు కనబడనిచో మూడునెలలో మరణించును.

తన శరీరము కంపుకొట్టినను, స్నానము చేసినవెంటనే శరీరమున తడి కనబడకుండినను, ఎలుగు, గాడిద, కోతి, దున్నపోతు వీనిపై నెక్కి దక్షిణాభి ముఖముగా పోవుచున్నట్లు కల వచ్చినను, తల విరయబోసికొన్న స్త్రీ యేడ్చుచు కలలో కనబడినను, చెవులు మూసికొన్నప్పుడు ప్రాణఘోషము (గుంయ్యి మను శబ్దము) వినబడకపోయినను, ముక్కు వాసనను, నాలుక రుచిని గ్రహించలేకపోయినను త్వరలో మరణము కలుగునని తెలిసికొని బుద్ధిమంతుడైనవాడు భగవంతునియందే ధ్యానము నుంచి జ్ఞానియై మోక్షసౌఖ్యమును పొందుటకు ప్రయత్నించవలెను.

## దుస్సహుడు - వాని సంతతి

సృష్టిచేయు కాలమునందు బ్రహ్మ మనస్సున గల్గిన విసుగు కారణముగా దుస్సహుడను రాక్షసుడు పుట్టెను. అతనికి అతనికి యెక్కువ. కనబడిన జంతువుల నన్నింటిని మ్రింగుచుండెను. అది చూచి బ్రహ్మ "ఓరీ!నీవిట్లు అన్నింటిని మ్రింగరాదు. నీవు తినుటకు పదార్థములు, ఉండదగిన చోట్లు చెప్పెదను వినుమని యిట్లు చెప్పెను. "నీవు సత్కర్మానుష్ఠానములకు ఆటంకము కలిగింపుము. దుర్జనుల యిండ్లలో నుండుము. సాలెపురుగులు, కుక్క, పిల్లి, ముట్టిన పదార్థములను, కుండలలో నిలువయున్న అన్నములను, ఊదిన పదార్థములను, దేవునికి నివేదన చేయక ఉన్న పదార్థములను నీవు తినుచుండుము. దీపపు క్రీనీడలోను, ఉదయము సాయంకాలము సంధ్యాసమయములలోను ఎవరు భోజనము చేయుదురో వారి పుణ్యము నీకు చెందును. శ్రద్ధ లేకుండ చేయు హోమములును, స్నానసంధ్యాదులకు ముందే అపవిత్రముగా చేయు దానధర్మాదులును, జలధార లేకుండ ఇచ్చిన దానమును ఇచ్చినవారికి పుణ్యము నీయవు. ఆ పుణ్యము నీకు చెందును. ఇంటిముందు కళ్ళాపి చల్లి ముగ్గులు పెట్టని యిండ్లలోను, పుట్టలు పెట్టిన యిండ్లలోను, రాత్రి దీపము పెట్టని యిండ్లలోను నీవు నివసించుచుండుము.

www.telugubooks.tk - Visit us for mor


నియమనిష్ఠాపరులై ఆచారవ్యవహారములు నడుపుచు సత్కర్మలు ఆచరించు సజ్జనుల ఇండ్లజోలికి పోకుము".

ఆ దుస్సహుడు అట్లేయని బ్రహ్మ చెప్పినట్లు నడచుకొనుచుండెను.

కలిపురుషుని భార్య ఒక చండాలునితో సంపర్కము పెట్టుకొని నిర్మాష్టి అను కుమార్తెను గనెను. దానిని ఈ దుస్సహుడు పెండ్లియాడెను. దానియందు వీనికి ఎనమండుగురు కుమారులును, ఎనమండుగురు కుమార్తెలును జనించిరి. వారందరును ప్రజలను బాధించువారే.

వారి పేర్లు, వారు చేయు పనులును ఇట్లుండును.

కొడుకులు :

1. దంతాకృష్టి : పిల్లలు పండ్లు కొరుకుటకు కారణము వీడే. ఆవాలు చల్లి, సువర్చస్సులను మూలిక కలిపిన నీటితో పిల్లలకు స్నానము చేయించుటచే వీని పీడ తొలగును.

2. వ్యక్తి : ఇంటిలోనివారు శుభవాక్యములుగాని అశుభవాక్యములుగాని ఉచ్చరించినచో 'తథాస్తు'అనుచుండును. అశుభ వాక్యములు పలికినప్పుడు శ్రీకృష్ణనామ స్మరణచేయవలెను.

3. పరివర్తకుడు : గర్భస్రావములకు వీడే కారణమగును. గర్భస్థ పిండములను పీడించును. గర్భమును రక్షించు వేదమంత్రములను పఠించినచో వీని పీడ తొలగును.

4. అంగయుక్తుడు : గాలిరూపములో శరీరములందుండి, కన్నులు భుజములు మొదలగు అంగములను అదురునట్లు చేయును. దర్భలతో అదిరిన అంగములను తుడిచినచో వీని పీడ తొలగును.

5. శకుని : కాకి, గ్రుడ్లగూబ, మొదలగు పక్షులందు చేరి శుభాశుభములను తెలుపుచుండును. (శకునపక్షి అను లోకోక్తి వీనివలననే వచ్చియుండును.)

6. గండ ప్రాంతరికుడు : గండాంతము అను ముహూర్తమునం దుండి వీడు ప్రమాదములు కలిగించును. ఆవాలు కలిపిన గోపంచితముతో స్నానముచేసి దేవతల, బ్రాహ్మణుల వల్ల దీవెనలు పొందినచో వీని పీడ పోవును.

7. గర్భఘ్నుడు : పువ్వుల ద్వారా గర్భిణీ స్త్రీల గర్భములలో జేరి పిండములను నాశనము చేయును. అందుకే గర్భిణీస్త్రీలు పూవులు పెట్టుకొనరాదు. భగవన్నామస్మరణయే దీనికి శాంతి.

www.telugubooks.tk - Visit us for mor


8. సస్యఘ్నుడు : పంటలు పండు పొలములలో జేరి పంటలను, కూరగాయలను చీడలద్వారా పాడుచేయును. దిష్టిబొమ్మలను పొలములలో కట్టినచో వీని పీడ ఉండదు.

ఇంక కుమార్తెలు :

1. నియోజిక : పురుషులకు, ఇతరుల ధనముల మీదను, స్త్రీలమీదను వ్యామోహము పుట్టించును. వేదపారాయణము, పురాణపఠనము చేయువారి కీమె వల్ల పీడ ఉండదు.

2. విరోధిని : ఆలుమగల మధ్య పోట్లాటలు, వైమనస్యములు కలిగించును. దానధర్మములతో ఈమె పీడ పోవును.

3. స్వయంభార : పాడిపశువులు, స్త్రీలు, ధాన్యములు, మున్నగువాని వద్దచేరి నాశనము చేయుచుండును. నెమలి యీకలుగాని, దేవుని పటములు గాని అక్కడ ఉంచుటవలన దీని పీడ పోవును.

4. భ్రామరి : మగవారికి, కారణము లేకుండగనే స్త్రీలపై కామవికారములు పుట్టించును. భూసూక్తము పారాయణచేసి, ఆవాలు చల్లినచో దీని పీడ తొలగును.

5. ఋతుహారిక : రజస్సు స్త్రీలకు సంతాన కారణము. అట్టి రజస్సును ఇది క్షీణింప జేయును. నదీస్నానములు, ఔషధసేవనము చేసిన దీని పీడపోవును.

6. స్మృతిహారిణి : మనుష్యులలోని జ్ఞాపకశక్తిని అపహరించును. అగ్నిహోత్రము చేయుట, అది చేయలేనివారు లలితాసహస్రనామ పారాయణము చేయుట ద్వారా దీని పీడనుండి విముక్తి పొందవచ్చును.

7. బీజహారిణి : స్త్రీ పురుషులయందుండు శుక్రశోణితములలో గల సంతాన బీజములను నాశనము చేయును. విత్తనములలో జేరి వానియందు మొలకెత్తు శక్తిని పోగొట్టును. వ్రతములు, అన్నదానములు మొదలగు దానధర్మముల వలన ఈ పీడ పరిహారమగును.

8. విద్వేషిణి : ఇది దంపతుల మధ్య చేరి ప్రతిదినము కలహములు పుట్టించుటకు ప్రయత్నించును. దేవతారాధనములు, బ్రాహ్మణభోజనములు జరిపించినచో ఇది శాంతించును.

ఈ పదునారుగురికిని సంతానము ఉన్నది. వారందరును ప్రజలకును అందులోను అనాచారవంతులకును, ధర్మము నాచరింపని వారికిని కీడు చేయుచుందురు.

www.telugubooks.tk Visit us for mor


## అష్టమూర్తి మహేశ్వరుడు

బ్రహ్మదేవుడు సృష్టిచేయుటకు సంకల్పముచేసి, తనకు తోడుగా ఇంకను ఎవరైన ఉన్నచో ఈ కార్యము విస్తృతముగా సాగునుగదాయని ఆలోచించెను.

ఆ సంకల్పబలముచేత నీలలోహిత వర్ణము (వయొలెట్ కలరు) గల రుద్రుడను వాడు పుట్టి యేడ్చుచుండెను. ఎందుకేడ్చుచున్నావని యడుగగా తనకు పేరు పెట్టలేదేమనెను. బ్రహ్మ నీకు పేరు లేక పోవుటేమి?ఎనిమిది పేర్లు నీకున్నవి. భవుడు, శర్వుడు, ఈశానుడు, పశుపతి, రుద్రుడు, ఉగ్రుడు, భీముడు, మహాదేవుడు ఈ పేర్లన్నియు నీవేయని చెప్పెను. అతడు నీరు, నిప్పు, గాలి, భూమి, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, యజ్ఞదీక్షితుడు అనురూపములతో ప్రకాశించుచుండెను. అతడు దక్ష ప్రజాపతి కుమార్తె సతీదేవిని పెండ్లియాడెను. ఆమె, తండ్రి చేసిన అవమానమును భరింపలేక యోగాగ్నిలో దన శరీరమును కాల్చివేసికొనెను. ఆ కోపముతో రుద్రుడు దక్షయజ్ఞము ధ్వంసముచేసెను. ఆ సతీదేవి తిరిగి హిమవంతుని గర్భమున పార్వతిగా జనించెను. మహేశ్వరుని భర్తగాకోరి మహాతపస్సుచేసి ఆయన అనుగ్రహము సంపాదించి పెండ్లాడెను.

## మనువులు - మన్వంతరములు

బ్రహ్మమానసపుత్రుడైన స్వయంభువు అనునతడు మొదటి మనువు. అతడు శతరూపము పెండ్లియాడి సృష్టిని విస్తరింపజేయుటలో తండ్రికి తోడ్పడెను. అతని వలన వెలసిన రాజవంశములు చాల ఉన్నవి. రెండవవాడు స్వారోచిషుడు. ఇతని జన్మవృత్తాంతము విన్నవారికి సకల పుణ్యములు చేకూరును అని జ్ఞానపక్షులు చెప్పగా జైమిని, దానిని నాకు వినిపింపుడని వానినడిగెను. జ్ఞానపక్షులాతని వృత్తాంతమునిట్లు చెప్పదొడంగెను.

## స్వారోచిషమనువు పుట్టుక

పూర్వము వరణానది యొడ్డుననున్న అరుణాస్పదమను పట్టణములో ప్రవరుడను ఒక బ్రాహ్మణుడుండెను. అతడు వేదవేదాంగ విశారదుడు. మహాసౌందర్యవంతుడు. నియమనిష్ఠాగరిష్ఠుడు. యజ్ఞయాగాదులు చేసి సోమయాజియైనాడు. గృహస్థధర్మములను చక్కగా పాటించుచు ఇంటికి వచ్చిన అతిథిఅభ్యాగతులను ఆదరించెడివాడు. అతనికి తీర్థయాత్రముల చేయవలెనను కోరికయున్నను ఇంటిలో అగ్నిహోత్రములను విడిచి వెళ్ళలేకపోయెను.

ఒకనాడతని యింటికి ఒక రససిద్ధుడు వచ్చెను. అతనికి భోజనాది సత్కారములు చేసి, మీరేయే తీర్థములను క్షేత్రములను సేవించినారో దయచేసి చెప్పుడు. వెళ్ళి సేవించలేకపోయినను వినుట కూడ పుణ్యప్రదమే కదా!అని యడుగగా, సిద్ధుడు, "అన్ని తీర్థములను, క్షేత్రములను సేవించినాను. సమస్త దిక్కులందు దిరిగి సర్వ క్షేత్రములను చూచినానని చెప్పగా, ప్రవరుడు "మీవయసు చూచిన చిన్నదిగా కనబడుచున్నది. ఇన్ని తీర్థయాత్రలు చేయుటకు ఏండ్లునుపూండ్లును పట్టునుగదా!ఎట్లు చేసితిరి?"అని యడిగెను. సిద్ధుడు, "మేము రససిద్ధులమగుటచే రోగముగాని ముసలితనముగాని మాజోలికి రావు. అంతేకాదు. దైవానుగ్రము వలన మాకు ఒక పసరు దొరికినది. అది అరికాళ్ళలో పూసికొని మేమెంత దూరమైనను ఆకాశమార్గమున నిమిషములో ప్రయాణించగలము"అని చెప్పగా ఆ పసరు నాకు గూడ పూసి

ధన్యునిజేయుడని ప్రవరుడు కోరెను. సిద్ధుడు ఆ పసరు ప్రవరుని అరికాళ్ళలో పూసివెళ్ళెను. ప్రవరుడు హిమాలయములు చూడవలెననుకొని క్షణములో అక్కడ వాలెను. చాలసేపు ఆ హిమవత్పర్వత సౌందర్యములను జూచి ఇంటికి వెళ్ళవలెనని ప్రయత్నించెను. కాని కాలిలో రాసిన పసరు మంచునీళ్ళకు కరగిపోయెను. దారి యెవరినైన అడుగవలెనని తిరుగుచుండగా ఒకచోట వరూధిని యను గంధర్వ స్త్రీ వీణవాయించుచు కనిపించెను. ప్రవరుడు ఆమెను తనయూరికెట్లు పోవలెనో చెప్పుమని యడుగగా, ఆమె "ఇంతంతకన్నులున్నవాడవు, వచ్చిన దారినే యెరుగవా? ఒంటరిగానున్న కన్యలను పలుకరించుటకు ఇదొక వంకయా?"అనెను. అతని అద్భుత సౌందర్యమున కామె పరవశురాలైపోయెను. "ఇక్కడనుండరాదా?"యనెను. "నాకగ్నిహోత్రములు చెడిపోవును, వెళ్ళవలె"నని యితడనెను. ఆమె, "మీ యజ్ఞయాగాదులకు ఫలము మా దేవతాస్త్రీలతో సౌఖ్యమే కదా!అందుచేత నాతో భోగములనుభవించుచు ఉండిపొమ్మ"నెను. ప్రవరుడు వీలులేదనెను.

కౌగలించుకొన్నను లొంగిపోడా యని వరూధిని అతనిని కౌగలించుకొనెను. బ్రాహ్మణుడు మొగము త్రిప్పుకొని "శ్రీహరీ"అనుచు ఆమెను త్రోసివేసి వెడలిపోయెను. నియమనిష్ఠాగరిష్ఠులైనవారికి శ్రీహరి నామము తప్ప మరొకటి నోటికిరాదు. వారి సంస్కారమటువంటిది. అగ్నిహోత్రుని ప్రార్థించి తన యింటికి చేరుకొనెను.

www.telugubooks.tk - Visit us for mor


ఇక్కడ వరూధిని ప్రవరుని కోసము తపించుపోవుచుండెను. వరూధినిని ఇది వరకే ఒక గంధర్వ కుమారుడు ప్రేమించి ఈమెచేత తిరస్కరించబడెను. ఇప్పుడు వరూధిని ప్రవరునికై విరహము ననుభవించుట తెలిసికొని తాను మాయా ప్రవరుడైవచ్చెను. వరూధిని సంతోషించెను. కొంతకాలము సౌఖ్యములనుభవించిరి. వరూధిని గర్భవతి అయ్యెను. మాయా ప్రవరుడు తన మోసము బయటపడకుండ మెల్లగా తప్పుకొనెను. వరూధినికి కొడుకుపుట్టెను. అతని పేరు స్వరోచి. అతడు, వరూధిని దృష్టిలో ప్రవరుని కొడుకు. కావున అతనికి ఉపనయనాదులు చేయించి,వేదవేదాంగములునేర్పించెను. ధనుర్వేదమునుగూడ నేర్పించెను. స్వరోచి యొకనాడు మందరగిరి ప్రాంతమున తిరుగుచుండగా ఒక స్త్రీ ఆర్తనాదము వినిపించెను. ఆమె నితడు, నీవెవ్వరనియడుగగా, "నేను ఇందీవరాక్షుడను గంధర్వరాజు కుమార్తెను. నన్నొక రాక్షసుడు భక్షించబోవుచున్నాడు. నేను నా చెలికత్తెలతో విహరించుచు, సన్నముగా పుడకవవలె నున్న ఒక మునిని అధిక్షేపించితిని. అతడు కోపించి, నిన్ను రాక్షసుడు భక్షించుగాక అని నన్నును, కుష్ఠక్షయ వ్యాధి పీడితలు కండని నా చెలులను శపించెను. నేను నా తండ్రి నుండి సంపాదించిన శస్త్రాస్త్రములు నీకిచ్చెద"నని చెప్పి అవి అన్నియు ఉపదేశించెను. ఆ దివ్యాస్త్రములతో స్వరోచి రాక్షసుని కొట్టెను. ఆ దెబ్బకతడు రాక్షసరూపము వదలి, "వీరుడా!నేనే ఇందీవరాక్షుడను. ఈమె మనోరమ, నా కుమార్తె. బ్రహ్మమిత్రుడను మునిని నేను ఆయుర్వేదము నేర్పుమని అడిగితిని. ఆయన కాదనెను. నేను మాయారూపముతో శిష్యులతో గలిసి నేర్చుకొని, ఆ గురువును పరిహాసము చేసితిని. అతడు కోపించి నన్ను రాక్షసుడవుకమ్మని శపించెను. గురునింద యెంత దోషమో అప్పుడు నాకు తెలిసినది. నీ బాణపు దెబ్బలవలన శాపవిముక్తి కలిగినది. ఈ నా కుమార్తెనిచ్చెదను, వివాహమాడు"మనెను. స్వరోచి సమ్మతించెను. ఆమె చెలికత్తెలను గూడ శాపవిముక్తులను చేసెను.వారిలో విభావరి, "వీరవరేణ్యా!నా రోగము మాన్పితివి కావున నీకు సమస్త జంతు పక్షిభాషలను నేర్పెద"ననెను. నేర్పెను గూడ. కళావతి, "నేనొక ముని కుమార్తెను. నా తల్లి పుంజికస్థల అను అప్సరస. నేను పుట్టగానే నన్ను నా తల్లితండ్రులు విడిచిపెట్టిరి. పార్వతీదేవి నన్ను కరుణించి, నవనిధులను కనిపెట్టగలుగు "పద్మిని"అను విద్యను ఉపదేశించి, నీవు స్వరోచిని పెండ్లాడెదవని దీవించెను. కావున మనోరమతోపాటు ఆమె చెలులమైన మమ్ముకూడ వివాహమాడుము"అ ని చెప్పగా స్వరోచి ఆ ముగ్గురిని పెండ్లాడెను.

www.telugubooks.tk Visit us for more 
వారితో సకల భోగములనుభవించుచు, ఒకనాడు వేటకు బోయెను. అక్కడ ఒక భల్లూకమును చంపబోగా ఆడలేడి యొకటి అడ్డమువచ్చి, "నన్ను చంపుము;నేను వరించిన వానిని పొందలేకపోయితి"ననగా, అతడు, "నీవెవరిని వరించితి"వని యడిగెను. ఆలేడి, "నిన్నే"అని ప్రత్యుత్తరమిచ్చెను. స్వరోచి నవ్వి, నీవు లేడివి. నీతో వివాహమేమి?అనగా, లేడి, "ఒకసారి నన్ను కౌగలించుకొనుము. నీకే తెలియు"ననెను. అతడాలేడిని కౌగిలించుకొనెను. ఆలేడి ఒక మహాసౌందర్యవతియైన స్త్రీగా మారి, "నేను వనదేవతను. నేను దేవతల కోరికపై నిన్ను వరింపవచ్చినాను. మన కలయికవలన మనువు కాగల ఒక మహానుభావుడు పుట్టును"అని చెప్పగా స్వరోచి ఆమెను గాంధర్వవివాహమాడి ఆమెతో సౌఖ్యములనుభవించెను. ఆమెకు సద్యోగర్భమున (ఏడు గడియలలో) పిల్లవాడు జన్మించెను. వాడు జన్మించగానే దేవతలు పుష్పవర్షము గురిపించిరి. అతని పాలనలో ధర్మము నాలుగుపాదములతో నడచెను.
స్వరోచి కుమారుడుగాన స్వారోచిషుడని పిలువబడెను. మూడవవాడు ఉత్తముడు, నాలుగవవాడు తాప(మ)సుడు, అయిదవవాడు రైవతుడు, ఆరవవాడు చాక్షుషుడు, ఏడవవాడు సూర్యకుమారుడైన వైవస్వతుడు. ఇప్పుడు అతని మన్వంతరమే (మనువు పరిపాలనకాలము) జరుగుచున్నది. ఈపైన సూర్యసావర్ణి, అగ్నిసావర్ణి, బ్రహ్మసావర్ణి, రుద్రసావర్ణి, దక్షసావర్ణి (ధర్మ సావర్ణి) రౌచ్యుడు, భౌచ్యుడు అను ఏడుగురును పరిపాలనలోకి వచ్చెదరు. వీరి చరిత్రలు చదివినను, కనీసము నామములు విన్నను సకలారిష్టములు తొలగి, ఆయురారోగ్య భోగభాగ్యములు, శత్రునాశనమును, సకల కార్యవిజయమును కలుగును. అని జ్ఞానపక్షులు చెప్పగా విని జైమిని సంతోషించి, సూర్యోపాసనవలన ఫలితములు చెప్పుడని కోరెను. పక్షులిట్లు చెప్పసాగెను.
"సూర్యుడు జగత్తులకే కన్నువంటివాడు. ఆయన బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపుడు. ఉదయకాలమందు బ్రహ్మ స్వరూపుడు. మధ్యాహ్నకాలమందు రుద్రస్వరూపుడు. సాయంకాలమున విష్ణుస్వరూపుడనియు చెప్పబడును. వేదములందును ఈయన మహిమలు ఇట్లు వర్ణింపబడినవి. సూర్యుడు వేదమయుడు. ప్రాతఃకాలమున ఋగ్వేదమునందు వెలుగొందుచుండును. మధ్యాహ్నమున యజుర్వేదమున ప్రకాశించును. సాయంకాలమునందు సామవేదమున దీపించును. త్రికాలము లందును ఏ క్షణముగూడ వేదములు అనుసరించకుండ సూర్యుడు సంచరించడు.

www.telugubooks.tk Visit us for mor


సూర్యునారాధించు వారికి హృద్రోగములు (గుండెజబ్బులు) ఉండవు. హరిమ (పచ్చకామెర్లు) అను వ్యాధిరాదు. నేత్రరోగములుండవు. (పూర్వము మయూరుడను మహాకవి, అంధుడై తనకు దృష్టికలుగుటకు సూర్యుని ఆరాధించి ఆయనపై నూరు శ్లోకములు చెప్పి, ఆయన అనుగ్రహముచేత దృష్టిని సంపాదించెను.) ఉదరసంబంధములైన రోగములుగాని, మహావాత, మేహరోగములుగాని సూర్యునారాధించెడివారికి రావు. ఒకవేళ అట్టిరోగములున్నవారు సూర్యారాధనము చేసినచో ఆరోగములు శాంతించి దేహారోగ్యము కలుగును. ఋగ్వేదమందలి మహాసౌరము, యజుర్వేదమందలి అరుణము ఈ రెండింటితోపాటు త్రిచవిధానముగా సూర్యనమస్కారములు చేసినచో లేదా చేయించుకొన్నచో సమస్తవ్యాధులును నశించి ఆరోగ్యవంతులగుదురు. అని చెప్పగా విని జైమిని, "మహానుభావులారా!మీవలన అనేక పుణ్యకథలను విన్నాను. మరుత్తరాజు కథను నాకు చెప్పుడు"అని అడుగగా పక్షులిట్లు చెప్పెను.

జెమిని మునీంద్రా!పూర్వము విదిశానగర రాజ్యమును విశాలుడను రాజు పాలించుచుండెను. అతని కొక కుమార్తె కలదు. ఆమె పేరు వైశాలి. ఆమె మహాసౌందర్యవతియనియు, సద్గుణరాశి యనియు, మహావిద్వాంసురాలనియు ప్రసిద్ధిపొందెను. తండ్రి ఆమెకు స్వయంవరము చాటించెను. ఆ స్వయంవరమునకు చాలమంది రాజులు వచ్చిరి. బలాశ్వుని కుమారుడైన అవీక్షిత్తు అను రాజకుమారుడు కూడ వచ్చెను. ఆ వైశాలి తనను కాక యింకెవరినైన వరించునేమో యని శంకించి, అవీక్షిత్తు స్వయంవరమండపము నుండి ఆమెను ఎత్తుకొని తన రథముపై కూర్చుండబెట్టుకొని పోసాగెను. రాజులందరును అతని నెదిరించిపోరాడిరి. అతడు అసహాయ శూరుడై ఆ రాజులందరిని ఓడించివేసెను. పరాజయము చవిచూచిన ఆ రాజులందరును వంచనతో అవీక్షిత్తును చుట్టుముట్టిరి. అధర్మముగా యుద్ధముచేసి పట్టి బంధించిరి. విశాలుడతనిని కారాగృహములో బంధించెను. తరువాత అతడు కుమార్తెతో "మిగిలిన రాజులలో నీకు నచ్చినవానిని వరింపు"మని చెప్పగా, ఆమె "అవీక్షిత్తు పరాక్రమము ఎటువంటిదో కన్నులార చూచినాను. అతడు అతిలోకపరాక్రమవంతుడు. ఈ రాజులందరును అతనిని ధర్మయుద్ధములో గెలువలేక మోసముచేసి బంధించినారు. ఇటువంటి వంచకులైన రాజులను నేను వరించలేను.

www.telugubooks.tk - Visit us for mor


ఎప్పటికైనను ఆ అవీక్షితుడే నా భర్త"అని చెప్పెను. విశాలుడు మాటలాడక ఊరకుండెను. అవీక్షితుని తండ్రియైన బలాశ్వునకీ సంగతి తెలిసినది. వెంటనే సైన్యముతో వచ్చి విశాలుని యుద్ధములో ఓడించి కుమారుని విడిపించెను. వైశాలిని ఇప్పుడు పెండ్లియాడుమనగా అవీక్షితుడు, "నేను ఈ వైశాలి కన్నుల యెదుటనే శత్రువులచేతిలో వంచనవల్ల నైననేమి, పరాజితుడనై, ఆమె దృష్టిలో చులకనయైతిని. ఇంక నేనామెను వరించలేను"అని చెప్పగావిని యెవ్వరును మాటలాడలేకపోయిరి. వైశాలి తన దురదృష్టమునకు విచారించి, వివాహముపై ఇష్టములేక అరణ్యమునకు పోయి తపస్సు చేసికొనుచుండెను. ఇటు అవీక్షితుడును మరియొక స్త్రీని వివాహమాడలేక బ్రహ్మచారిగా ఉండిపోయెను. బలాశ్వుడు వృద్ధుడై పోయెను. తన కొడుకు పెండ్లిచేసికొనలేదు. ఇదే విచారముతో ఆరాజు, ఒకనాడు అవీక్షితుని పిలిచి తన ఆవేదనను వెల్లడించెను. అవీక్షిత్తు తండ్రి మనోవేదనను గ్రహించి చివరకు పెండ్లిచేసికొనుటకు సమ్మతించెను. ముసలిరాజు కొడుకు పెండ్లి ప్రయత్నములలో నుండెను. ఇట్లుండగా ఒకనాడు అవీక్షితుడు వేటకై, వైశాలి తపముచేయుచున్న అడవికే వెళ్ళెను. వేటాడుచుండగా ఒక స్త్రీ చేయుచున్న ఆర్తనాదము వినిపించెను. అతడు ఆ దిశకు వెళ్ళి చూడగా ఒక రాక్షసుడు ఒక ముని కన్యవంటి స్త్రీని ఎత్తుకొనిపోవుచుండెను. అవీక్షిత్తు అతని నడ్డగించి పోరాడసాగెను. దృఢకేశుడను ఆ రాక్షసుడు అవీక్షిత్తు పరాక్రమమునకు ఆశ్చర్యపడి, "ఓ రాజకుమారా!నీవు అనవసరముగా ప్రయాసపడుచుంటివి. నేను గృహస్థుడైనవాని చేతిలోగాని చావను. నీవు బ్రహ్మచారివి. నన్నేమియు చేయలేవు. తిరిగిపొమ్ము"అనెను. అవీక్షిత్తు "రక్షించుమని ప్రార్థించుచున్న స్త్రీని వదిలిపోవుట క్షత్రియలక్షణము కాదు. నీవన్నదే నిజమైనచో నేనీమెను మానసికముగా వివాహమాడుచున్నాను. కావున గృహస్థుడనైతిని"అనుచు ఆ దృఢకేశుని యుద్ధములో వధించెను. ఆ తాపసియైన వైశాలి ఇతడు అవీక్షితుడని గుర్తుపట్టెను. ఇతడును ఆమె వైశాలియని గుర్తించెను. ఇరువురును పరమానందభరితులై రాజమందిరమునకు వచ్చిరి. జరిగినది తండ్రికి చెప్పి అవీక్షిత్తు అతనిని ఆనందింపజేసెను. ఆ తండ్రి వారిరువురుకును విధివిధానముగా పాణిగ్రహణము కావించెను.

www.telugubooks.tk Visit us for mor


ఆ దంపతులకు 'మరుతు'అను కుమారుడు జన్మించి, సకల విద్యలును నేర్చి తండ్రి తరువాత సింహాసనమెక్కి, జంబూ, ప్లక్ష, శాల్మలీ, కుశ, క్రౌంచ, శాక, పుష్కరములను పేర్లుగల సప్తద్వీపములను ఏకచ్ఛత్రాధిపత్యముగా పరిపాలించి, ధర్మమూర్తియై షట్చక్రవర్తులలో ఒకడుగా పేరుపొందెను.

భారత వర్షము - ప్రాధాన్యము

జంబూద్వీపమును పరిపాలించుచు ఆగ్నీంధ్రునకు కుమారుడు ఋషభుడు. అతని కుమారుడు భరతుడు. అతడు మహాపరాక్రమవంతుడై జంబూద్వీపమందలి యీ దేశమును పాలించుట చేత దీనికి భారతవర్షమని పేరు గలిగినది. భారత, కింపురుష, ఇలావృత, కురు. భద్రాశ్వక, రమణక, హిరణ్యక, కేతుమాల, హరి అను తొమ్మిది వర్షము (దేశము)లలో భారత వర్షము గూడ ఒకటి. ఈ భారత వర్షమునకు ఉత్తరమున హిమాలయపర్వతములున్నవి. మిగిలిన మూడు దిక్కులందును సముద్రములున్నవి. ఈ వర్షము కర్మభూమి. ఈ వర్షమునందే శ్రీమన్నారాయణుడు దశావతారములెత్తి తన లీలావైభవమును ప్రదర్శించినాడు. మిగిలిన వానికంటెను దీనికి ప్రాశస్త్యము ఇందువలననే కలిగినది. పుణ్యములు చేయు వారు, యజ్ఞయాగాదులు చేయువారు, వేదములు పఠించువారు, ఈ వర్షమునందేయుందురు. పుణ్యములు చేసినవారికి ఇంద్రాది పదవులు లభించును. పాపాత్ములకు నరకప్రాప్తియగును. మనుష్యులు పూర్వ కర్మవశమున చేయు పాపపుణ్యకర్మములను నివారించెడి శక్తి యెవ్వరికిని లేదు.

ఈ భారతవర్షమునందు శ్రీమన్నారాయణుడు కూర్మరూపుడై నివసించుచుండును. కూర్మమునకు నాలుగుపాదములు, తల, తోక, బొరుసు (పృష్ఠభాగము), దక్షిణ కుక్షి, (కడుపు కుడివైపు) వామకుక్షి (పొట్టలో ఎడమవైపు) అను తొమ్మిది భాగములందును పంద్రెండ్రు మేషాదిరాసులు తిరుగుచుండును. పృష్ఠమున మేషవృషభరాసులును, శిరోభాగమున మిథున కర్కాటకములును, ఆగ్నేయపాదమున సింహరాశియు, దక్షిణకుక్షియందు కన్యాతులలును, నైరృతిపాదమందు వృశ్చికమును, పుచ్ఛమున (తోకయందు) ధనూరాశియు, వాయువ్యపాదమున మకరమును, వామకుక్షి యందు కుంభరాశియు, ఈశాన్యపాదమున మీనరాశియు ఆశ్రయించుకొని యుండును.

ఈ ఆదికూర్మమే కాలమునకు ప్రతీక **(Indication)** యని చెప్పబడెను. కలుగుచుండును.

www.telugubooks.tk Visit us for mor


అరిష్టములు కలిగినప్పుడు ఏయే గ్రహములవలన అరిష్టములు కలిగినవో జ్యోతిష్కులవలన తెలిసికొని వానికి తగిన జపహోమతర్పణాదిశాంతులు చేసికొనవలెను. ఈ కూర్మమునకు పృష్ఠభాగమున మద్రవత్సశూరసేనాది దేశములుండును. ముఖమున మిథిలాప్రాగ్జ్యోతిషరాజ్యములు ఉండును. వంగ కళింగాది దేశములు ఆగ్నేయపాదమునందుండును. దక్షిణకుక్షియందు అజశైలికాది దేశములును, మహేంద్రాది పర్వతములును ఉండును. నైరృతి పాదమున కాంభోజాది దేశములుండును. హైహయాది దేశములును, మణిమేఖలాది పర్వతములును తోకయందుండును. వాయవ్యపాదమున పాండ్య తుషారాది దేశములుండును. ఎడమ కుక్షియందు హిమాలయ పర్వతములును, కేకయ నేపాళాది దేశములును ఉండును. కాశ్మీర, నైమిశారణ్య, నవద్వీపములు మొదలైనవి ఈశాన్య పాదమునందును ఉండును. ఈవిధముగా ఈ ఆదికూర్మము సకలదేశ కాలస్వరూపమై ఇచ్చటి జనుల జీవనమునకు ఆధారమగుచున్నది. అని జ్ఞానపక్షులు వినిపింపగా జైమిని మహాముని సంతుష్టి చెందినవాడై, ఆ పక్షుల సర్వజ్ఞత్వమును అనేక విధములుగా ప్రశంసించి సెలవు తీసికొనెను. ఈవిధముగా జైమిని సందేహము లన్నియు తీర్చి, అతనికి పుణ్యకథలు వినిపించుట వలన ఆ పక్షులకు శాపవిముక్తి కలిగెను. అని సూతుడు శౌనకాది మహామునులకు చెప్పగా వారు సంతోషపడిరి.

ఇది మార్కండేయ పురాణము.